కథానిక

# రట్టువడ్డ రంగడు

వల్లపురెడ్డి

శ్రీరంగపురం మా వూరికి నాలుగు మైళ్ళు. మా వూరికిమల్లే దానికి బస్సుల రాకపోకలు ఎక్కువగా లేవు. ఐనా, అక్కడ ప్రతియేడూ ఫాల్గుణ బహుళ పాడ్యమి మొదలుకొని అమావాస్యదాకా జరిగే జాతరవల్ల ఆ ఊరు చాలా పేరుపడసింది.

ఈ సంవత్సరం అనేకానేక కారణాంతరాలవల్ల జాతర ఎప్పుడూ జరిగేంత ఉధృతంగా జరుగలేదు—అంటే పశువులూ, జనమూ అంగళ్ళూ, వింతలూ, వినోదాలూ ఒకటేమిటి, అన్నీ తక్కువే. వీటితోబాటు భక్తులందరూ కలిసి ఆలయంలోని గర్భగుడిలో బంధించిన రంగనాయక స్వామికీ అర్చనలు తక్కువే.

ప్రతియేడూ మిత్రులమంతా కలిసి జాతర చూట్టానికి వెడతాం. పనిఉన్నా, లేకపోయినా సరదా కని వెళ్ళడం తథ్యం. కొందరిలాగు ఒక మారు వెళ్ళి చూసి రావడంతోనే తృప్తిపడే రకం కాదు మేము. పదిహేను దినాలు సాగే జాతరకు ఎటులేదన్నా కనీసం మూడు నాలుగుమార్లు వెళ్ళనిదే మా ఆకాంక్ష తీరదు. ఇలా వస్తున్న ఆచారాన్ని—అలవాటుని—అనుసరించి ఈ సంవత్సరం కూడా నేనూ, కృష్ణుడూ, జగన్నాథమూ, నరసింహం ఇత్యాదులం ఒక బండీ చేసుకుని ప్రయాణమై వెళ్ళాం. సాగనంపటానికి అందాకా వచ్చిన అమ్మ "రంగనాయక స్వామికి కాయా, శర్కరా ఇచ్చిరావడం మరువకు నాయనా!" అని చెప్పి వెళ్ళింది.

జాతరకు వెళ్ళేసరికే మధ్యాహ్నం ఒంటిగంటకి సమీపించింది. ఫాల్గుణ మాసపు మండు టెండలు మాడు పగుల గొడుతున్నా నేస్తులమంతా జట్టుగా జాతరలోని వీధివీధీ తిరిగాం. కొనాల్సిన వస్తుసముదాయాన్నంతా కొన్నాం. ఫలాలూ, తాయిలాలా వేటిపైకి మనస్సులు పర్వెత్తితే వాటిని ఆరగించాం. జాతర మోజుగా జరగకపోయినా, మాకు ఆనందానిచ్చే దృశ్యాలు ఏమీ లోపించలేదు. ఎదురుగా వస్తున్న జనాన్ని చీల్చుకుంటూ వెళ్ళే కొందరు తరుణ వయస్కుల యెదలపై పమిటలు తొలగినప్పుడు ఎంత ఉత్సుకతతో చూశామో, ఎంత మధురానుభూతిని పొందామో, ఒక చంద్రముఖి పయ్యెదను జారకుండా మాటిమాటికి సవరించుకుంటూంటే, మా కందరికీ తీరని నైరాశ్యం కలిగిస్తూంటే, అంతే మధురమైన బాధని అనుభవించాం. సుఖాన్ని అనుభవించడంలో కంటే అతీతమైన ఆనందం, అనుభవించక పోవడంలోనే ఉందని మాకా సమయంలో స్ఫురించక పోయినా తరువాత తరువాత తెలిసి వచ్చింది. జాతరలో మేం చూసిన రసవత్తర ఘట్టాలింకా అనేకాలున్నాయి. మచ్చుకి రెండుమూడు మాత్రం వివరిస్తాను.

వస్తువులు బేరం చెయ్యడానికి వచ్చిన వాళ్ళు ఎందరో ఉన్నా, దుకాణపుదారు ప్రత్యేకంగా ఒక మత్తకాశినికై చిరునవ్వునవ్వుతూ ఆమె కోరినవి అందించి, ఆమె కొనుకు తక్కువ వెలల్ని ఎవరూ వినకుండా రహస్యంగా సూచిస్తూ పిచ్చివానిలా ప్రవర్తిస్తూంటే చూసి అందరమూ ఒక్కసారి ఫక్కున నవ్వాం. అతడు మాకేసి కోపంగా చూశాడు. చాలా బాధపడ్డాడు కాబోలు! ఆమె కూడా అతనిమీద నవ్వుతుంపరల్ని విసురుతూ ప్రసంగిస్తుండడంవల్ల, ఆమెకూ అతనికీ ఏదో లంకె కుదరవచ్చు ననుకున్నాం. కాని మా నవ్వు చూసి ఆమె చక్కా వెళ్ళిపోయింది. అందులో మాకు వచ్చేదీ, పొయ్యేదీ ఏమీ లేకపోయినా, అనవసరంగా నవ్వి వాళ్ళ చూపుల్ని త్రుంచివేశామే అని పశ్చాత్తాపపడ్డాం.

మరో దుకాణం దగ్గర ఒకజంట—వాళ్లు దంపతులో, లేక కొత్త కొత్తగా, చాటు చాటుగా ప్రణయం రంగంలోకి దిగుతున్నవాళ్ళో తెలీదు—నిలుచుని కొనటానికని ఒక పెద్ద అద్దాన్ని తీసుకుని తమ ముఖాలకు దాన్ని, బావుందా లేదా అని

పరిశీలించే మిషతో, అడ్డంగా పెట్టుకుని పరస్పరం దాంట్లో తమ ప్రతిబింబాల్ని చూసుకుంటూ మంద మందంగా నవ్వుకుంటున్నారు; కన్ను గీటుకుంటున్నారు. మా జట్టు వారికి సమీపంగా వెళ్ళింది. ఆ జంట తమ నెవరూ చూట్టంలేదని ఇంకా కళ్ళు కలుపుకుంటూ ప్రణయవ్యాపారం సాగిస్తున్నారు. మా కృష్ణుడు "బలే మంచి చౌకబేరముం, మించిన దొరకదూ, త్వరన్ గొనుడి సుజనులార!" —అంటూ గొంతెత్తాడు కొంటెగా. తత్‌క్షణమే వాళ్లు అద్దాన్ని దుకాణపు వ్యక్తికిచ్చి మాకేసి చూశారు రోషకషాయిత ముఖాల్తో. మేమంద రమూ గొల్లుమని నవ్వాం. వాళ్ళక్కణ్ణుంచి చర చరా వెళ్ళిపోయారు. మా ప్రవర్తనని లోలోన బాగా తిట్టుకుని ఉంటారు.

ఒక పల్లె యువతి దర్జీదగ్గర నిలుచుని, రవిక కొలిచోలు కుట్టమంటోంది. దర్జీకూడ నవయువకుడే. బిగువుగా ఉన్న ఆమె సౌష్టవాన్ని అవలోకించే మిషతో కొలతలు తీసుకోవడం ప్రారంభించాడు. చేతులూ, మెడా, షోల్డరూ కొలుచుకుని ఛాతీ కొలత తీసుకుంటున్నాడు. ఆమె ఏవిధమైన జంకు గొంకు లేకండా నిర్లజ్జయై, అమాయకంగా పైట జారవిడిచి చేతులెత్తి నిలుచుంది- అతడు కొలత బట్టను వక్షోజాల మీదుగా పోనిచ్చి ఏదో లెక్కిస్తున్నట్లు నటిస్తూ ఆలస్యం చేస్తున్నాడు. ఆమెకు నూతనంగా కలిగిన యౌవనశ్రీని చూస్తూ నేత్రం పర్వం కావించుకుంటూ నిలుచున్నాడు. ఆమె త్వరపెట్టింది. అతడు "చూశానే, చూశానులే!" అంటూ ఆమె ముఖంలోకి సూటిగా చూస్తూ నర్మగర్భితంగా నవ్వాడు. వాడి కపటాన్ని గ్రహించిందామె. కోపంతో ఒక్క దెబ్బ చెంపమీదవడ్డించి, 'హాత్, దుడుకముండాకొడుకా!' అంటూ జనంలోకి పారిపోయింది రవికగుడ్డని చేత పుచ్చుకుని. కాచ్ ద సైట్—ఓహ్! ట్రాజెడీ. (Catch the sight—Oh! tragedy)" అనే కేక మా జట్టులోంచి బయల్వెడలింది. దర్జీ అవమాన భారంతో క్రుంగిపోయాడు. ఇలాంటి దృశ్యాన్ని ఇంకా పెక్కింటిని చూశాం. ఒక బింబాధర ముఖేందు బింబాన్ని తదేకంగా చూస్తూ, తద్వినిర్గత సుధాధారల్ని గ్రోలుతూ మైమరచి మత్తులో ఆమె చేతులకు అదేపనిగా లెక్కలేనన్ని గాజుల్ని తొడుగుతున్న గాజుల వ్యాపారిని చూశాం. అంత జనంలో ఇద్దరాలుమగలు ఎందుకో ఒకరిపైనొకరు చేయి చేసుకుంటే గుద్దుల చప్పుడు కంటే ముద్దుల చప్పుడే అధికంగా విన్పడింది.

అన్ని దుకాణాల్లోనూ మగవాళ్ళే వస్తువిక్రయం. ఒక్కదాంట్లో మాత్రం ఇరవయ్యేళ్ళ ప్రాయంలో ఉన్న ఒక కిన్నరకంఠి ఆగంతకులతో సరదాగా, చిరునవ్వుతో మాట్లాడుతూ చకచకా బేరం సాగిస్తూంది. జనమంతా — ముఖ్యంగా పురుషులు; పురుషుల్లోనూ మాలాంటి యువకులు ఎక్కువగా ఆ దుకాణం ముందే నిలుచుని ఏదోఒకటి కొంటూ ఆమె పలుకరింపు కొరకు వేచి ఉంటున్నారు. ఆమె భర్త కాబోలు, ప్రక్కన ఏవో వస్తువుల్ని సర్దుతూ బేరం సంగతి తనకు పట్టనట్లే నిశ్శబ్దంగా ఉన్నాడు. ఆ దృశ్యం చూస్తూనే నరసింహం అన్నాడు: "వ్యాపారం చెయ్యడంలోని కిటుకు ఈ ఒక్క దుకాణపుదారే కనిపెట్టాడు ఫ్రెండ్స్!" అని. "క్వయిట్ కరెక్టు (Quite Correct)"— బలపరిచాడు కృష్ణుడు. ఎటు కదిలినా ఇలాంటి దృశ్యాలు—మా వయస్కుల కుండే సహజ భావాలకు అనుకూలమైనవి—కన్పించాయి.

"ఒరేయ్, మనం నరకంలో పడిపోతాంరా, పరస్త్రీలని గురించి చాలా చెడ్డగా అనుకుంటున్నాం గాని."—అన్నాడు అంతసేపూ మాతో బాటు వినోదించిన జగన్నాథం. అంతటి శృంగారఘట్టాలనువీక్షిస్తుంటే అతనికెలా అలాంటి పరానికి సంబంధించిన ఊహ పొడమిందోమరి! అతని కొక్కడికేనా ఆ గాలి? మాకూ సోకింది.

"అవున్రోయ్! మనకళ్ళు పీకేస్తారు యమదూతలు. మన నాలుకలు చీరేస్తారు."—వివరించాడు మోహన్.

"ఛీ ఛీ, అలా కన్నులు చెదరనివ్వ కూడదురా మనం" అని ఒకరితో ఒకరకం రాజీపడి ముందుకు నడిచాం.

సూర్యుడు పడమటకు వాలిపోయాడు. ఐనా ఎండ తీక్షణంగానే ఉంది. "గుళ్ళో దేవుడికి కొబ్బరికాయ కొట్టివద్దాం పదండి" అన్నాను మిత్రబృందాన్ని సంబోధించి.

"అవును బ్రదర్స్, చక్కటి ఊహ. పదండి, పాపపరిహారమన్నా జరుగుతుంది."—అందరూ

నా వెంట ఆలయానికి రావడానికి సన్నద్ధులయ్యారు. "మనం శుంఠలం అని అమ్మగారికి తెలుసు. వెధవలు ఏమేమ పాపాలు చేస్తారో అనే బెంగ వేతే వచ్చేప్పుడు రంగనాయకస్వామికి కాయా, శర్కరా ఇచ్చిరమ్మంది. అమ్మ తెలివితక్కువదేమీ కాదర్రోయ్" అని ఒకడు ప్రారంభించేసరికి అందరూ "అవునవు" నన్నారు.

నాకు దేవుడంటే నమ్మకం ఉంది. ఐతే పూర్తి ఛాందసుడినిమాత్రం కాదు. దేవుడున్నాడు అనే వాదాన్ని ఒప్పుకుంటాను. కాని ఆ దేవుడు ఈ రంగనాయకస్వామి రూపంలోనే, ఇక్కడే, ఈ శ్రీరంగపురం దేవాలయంలోనే గర్భగుడిలో ఉన్నాడంటే మాత్రం అంగీకరించను. దేవుణ్ణి ప్రార్థించాలి, పూజించాలి; అంటే కాదనను. కాని, ఎదుట ఏదేని ఒక విగ్రహం—రంగనాయకస్వామి శిలావిగ్రహం లాంటిది—దేవుడి పేరుగా ఉంచుకుంటేనే తప్ప మనస్సుని స్థిరంగా నిలుపటానికి శక్యం కాదు అనే మాటలో అర్థం లేదంటాను. ఇవన్నీ నాకున్న వ్యక్తిగత అభిప్రాయాలు.

నాకిష్టం లేకపోయినా, అమ్మని సంతృప్తి పరచటానికి, అమ్మ మాటపై నాకు నిలిచిపోయిన అభిమానాన్నీ, గౌరవాన్నీ త్రోసి రాజనలేక జేబులో మిగిలిన కొద్దిపాటి చిల్లరతో ఒక నారికేళమూ, శర్కరా, అగరు వత్తులూ, కర్పూరం, కుంకుమా, పువ్వులూ మొదలైన అర్చనా సామగ్రి అంతా కొనుక్కుని శ్రీ రంగనాయకస్వామి ఆలయాభిముఖులమై నడిచాం.

పడమటకు వాలిన సూర్యుని కిరణాల్లో గోపురం మీది స్వర్ణ కలశాలు ధగధగా మెరిసిపోతున్నయ్. గోపురం నలువైపులా వివిధమైన బొమ్మలు చెక్కబడి ఉన్నయ్. వాటిలో కొన్ని శ్రీకృష్ణుడి జీవితాంశములుగా ఉన్నాయి. వాటినిచూసి మిత్రులు నవ్వడం మొదలెట్టారు. నేను మాత్రం ఏం జేస్తాను? అంతే చేశాను.

ఆ గోపుర నిర్మాణాన్ని గురించి ఒక కథ ఉంది. మా తాతలనాటి కాలంలో వనపర్తి రాణీగారు శంకరమ్మ ఒక గజదొంగను పెంచిందట. అతని పేరు 'మియాసావ్'ట. అతడు నిండు అమావాస్యనాడు పుట్టినందున గజదొంగయి ఎన్నో దోపిడీలు చేయించాడనీ, ఐనా బీదసాదలకు అంతా పంచి పెట్టి చాలా సహాయం చేశాడనీ ఇప్పటికీ మా ప్రాంతంలో బిచ్చగాళ్లు బుర్రకథలు చెబుతుంటారు. అతడే తను దోపిడి చేసి తెచ్చిన ధనంతో ఈ గోపురాన్ని కట్టించాడని ప్రతీతి. అయితే దొంగసొమ్ముతో నిర్మించిన ఆలయంలో దేవుడెట్లా నిలిచాడా అనే అనుమానం నాకు అది నుండీ తగులుక్కుని ఉంది. ఆలోచించి చూస్తే ఒక్కొక్కసారి దేవుడు — రంగనాయకుడు—గజదొంగల నాయకుడేమో నని తోస్తుంది.

దేవుడు ఉండనీ, ఉండకపోనీ దాంతో నాకు ప్రమేయం లేదు. అమ్మగారి ఆజ్ఞ ప్రకారం రంగనాయకస్వామికి కొబ్బరికాయ అర్పించి రావడం నా విధి. అంచేత మిత్రబృందంతో కూడి పాద ప్రక్షాళనం కావించుకోవడానికి ఆలయంలోని కోనేటి దగ్గరకు వెళ్ళాం. కోనేటిలో నీరు పచ్చగా చెత్త చెదారంతో నిండి ఉంది. ఒకటి రెండు సోపానాల్ని అవరోహించామో లేదో నీటి కంపు వాసన ఘటానాదానిలాగుందని చెప్పలేను గాని, సంపూర్ణ విశ్వాసంతో రంగనాయకుణ్ణి కొలువటానికి వచ్చిన భక్తశిఖామణిని సైతం పూజ అంటే ముఖం మొత్తించి, వచ్చిన వాడిని వచ్చినట్లుగా పరాఙ్ముఖుడిని చెయ్యడానికి చాలునని చెప్పగలను.

గాలి తెచ్చి గుప్పించిన నీటివాసన నాసికాపుటాల్లో దూరి ఉక్కిరి బిక్కిరి పరచగానే మిత్రుల మందరమూ ఒకరిముఖాలొకరం చూసుకున్నాము. ఆ కోనేటి నీటిలో స్వామి మహిమ ఉంటుందనీ, దాంట్లో కాళ్ళూ చేతులూ కడుక్కోకుండా పూజకు వెళ్ళిన వారికి మోక్షం లేదనీ అంటారు. ఈ విషయం నాకు మల్లేనే మిగతా వయస్కుల మస్తిష్కాల్లోనూ మెరసిందేమో మరి, చూపుల్ని క్రిందికి దించుకుని నాతో బాటు ఒక్కొక్క మెట్టే దిగి నీటిని సమీపించారు. ఇద్దరం, ముగ్గురం నీటిలోకి దిగి పుడిసిటిలో జలాన్ని తీసుకున్నాం. జలం జలం లాగు లేదు; తేనెకు దగ్గరి చుట్టంలా తీగలుగాసాగి క్రిందపడుతోంది. నా ఒళ్ళంతా జలదరమందింది. పుణ్యమూ, పాపమూ కన్నవారెవరూ లేరు. కాని చూస్తూ చూస్తూ సకల రోగాలను ప్రసాదించే ఆ నీటితో శుచిపేరిట అశుచి కావడం బుద్ధిమంతుల లక్షణాలా అవు

పించలేదు. ఇక మరలుదామని మిత్రులతో కళ్ళతోనే భాషించాను. మెల్లగా ఆలయం ప్రక్కని ఉన్న తటాకం దగ్గరికి దారి తీశాను. తటాకంలోని నీరు సూర్యకాంతుల్లో తళతళలాడుతూంది. వెళ్ళి, తటాకంలోని నిర్మలోదకంతో పాదప్రక్షాళనం కావించుకుని—కోనేటి నీటిలో కడుక్కోకండా ఆచారాన్ని ఉల్లంఘించిన బెంగ ఒకవైపు పీడిస్తుంటే—ఆలయం లోపలికి అడుగెట్టాం.

జాతర సాగే పక్షంరోజులూ అహోరాత్రాలు ఎడతెరపి లేకుండా అర్చనలు జరిగేవి. రంగనాయక స్వామి దర్శనానికి వచ్చి పోయే జనం ఇసక వేసినా రాలకండా ఉండేవారు. అలాంటిది ఈ సంవత్సరం ఒక్కడు కూడా లేడు. పూజారి బయట కట్ట మీద కూర్చుని కళ్ళు మూస్తూ, తెరుస్తూ క్రమంగా నిద్రాదేవికి వశుడౌతున్నాడు. మమ్మల్ని చూసి ఉన్మిషిత వదనంతో లేచాడు. లోపలికి వెళ్ళి తన పీఠంమీద కూర్చున్నాడు—గర్భగుడికి ముందున్న వసారా ద్వారందగ్గర. నేనా ద్వారం దాటి నేరుగా గర్భగుడిదగ్గరకి వెడుతుంటే అతడు వారించాడు.

“ఏం?”—అన్నాను తిరిగి చూసి.

“ఇక్కడే, లోపలికి వెళ్ళరాదు” అన్నాడు హీనస్వరంతో. మొట్టమొదట భక్తులందరూ పూజా విత్తాన్ని పుచ్చుకుని గర్భగుడి ద్వారందాకా వెళ్ళి, లోపల ఉండే పూజారికి ఇచ్చి పూజ చేయించే వారు. కాని ఈ పూజారిని చూసేసరికి నాకు ఒక విధంగా కోపమే వచ్చింది. స్వామి సమక్షంలో ఆగ్రహం చెందడం భావ్యం కాదని ఊరుకున్నాను. అదీగాక ఆ పూజారి వృద్ధుడు. షష్టిపూర్తి అయి కనీసం పది వత్సరాలైనా కాలచక్రంలో దొరలి ఉంటాయి.

వణకే చేతుల్తో నే నందించిన సామగ్రిని పుచ్చుకుని టెంకాయను అక్కడే పగులగొట్టాడు. సత్తువకొద్దీ ఎంత లేదన్నా పదిమార్లయినా రాతి కడపకేసి బాది ఉంటాడు. నీళ్ళన్నీ అక్కడే కారిపోయినై.

ఏ యేడు చూసినా కొబ్బరికాయల అర్ధభాగాలు గుడినిండా మూలుగుతూ పడి ఉండేవి. ఈ సంవత్సరం అక్కడ ఐదారు తప్పితే ఎక్కువేమీ కన్పించలేదు. నారికేళాలు పగులగొట్టగా పారిన నీరు గర్భగుడిలో పాదాలు మునిగేటట్లు నిలిచి ఉండేది. బయట అంతా చిత్తడి. ఈ సంవత్సరం తడైనా లేదు.

నారికేళాన్ని బహు కష్టంమీద బ్రద్దలు చేసి ఆ రెండు అర్ధభాగాల్ని పుచ్చుకుని లేచాడు అర్చకుడు. తాను గర్భగుడిదగ్గరికి నడుస్తూ, నన్ను అటు తిరిగి రమ్మని సంజ్ఞ చేశాడు. పూజారి దేవునికి ఎదురుగా పోవచ్చుగాని భక్తుడు పోరాదు. ఇదేమిటి న్యాయం, అనుకున్నాను మనస్సులో. రంగనాయకస్వామి ఇలాంటి అన్యాయాన్ని మిన్నకుండడం ఏం బావుంది?

నేను మనస్సులో ఇలా బాధపడ్డానని రంగనాయకుడు నోరు తెరచి, “ఏమయ్యా, నా భక్తుణ్ణి అలా అవమానపరిచావ్?” అని పూజారిని మందలించలేదు. కదలకుండా నిలుచున్నాడు.

పూజారి నిర్దేశించిన ప్రకారం నేను అటు తిరిగి గర్భగుడి ద్వారాన్ని సమీపించాను. మిత్రబృందం అంతా నన్ను వెంబడించింది. అతను కొబ్బరిని నైవేద్యం పెట్టాడు రంగస్వామికి. స్వామి తినలేదు. తనుగాని తినడం ప్రారంభిస్తే మరునాటినుంచి పూజలూ, పునస్కారాలూ మాయమౌతాయని అతనికి తెలుసు కాబోలు! రంగనాథుడు తినకపోయినా, ఆయన భాగానికి పూజారి వారసుడు. తత్కారణంగా తనకు రావాల్సిన భాగం తీసి ఒక ప్రక్కకు పెట్టుకున్నాడు. పళ్ళెరం తీసుకుని కర్పూరం వెలిగించాడు. స్వామి విగ్రహానికి ముమ్మారు క్రిందకీ, మీదికీ వలయాకారంగా త్రిప్పాడు. అతడు ఒక మంత్రం కూడా నోటంట రానీలేదు. “ఎందుకయ్యా మంత్రాలు చదవడం లేదు? అయితే నే నీ పూజ ఒప్పుకోను” అని రంగనాథుడు నోరు కదిలించలేదు. నిశ్చలంగా, తాను నిజంగా శిలా విగ్రహాన్నే అని నిరూపించుకుంటున్నట్లు నిలుచున్నాడు

ఇక నా సంగతంటారా? మా ప్రాంతంలో ఆధునిక ప్రపంచపు బ్రాహ్మణులు పెళ్ళిళ్ళలోనూ, వ్రతాలదగ్గరనూ చదివే మంత్రాలలో అడుగడుగునా అపభ్రంశాలు ఉచ్చరిస్తుండడం చూశాను. వాళ్ళలా చేయడం మూలాన వచ్చే శుభం లేకపోగా పాపాలు చుట్టుకుంటాయేమోనని నా అను

మానం. ఈ బ్రాహ్మణుల్లో చాలామంది ఏదో పూర్వపు మర్యాదను — వంశానుగతంగా వచ్చిన దాన్ని—అనుసరించి పౌరోహిత్యం నెరపుతూ తమకు తోచింది గడగడా నుడివి, వాటికి వేదోక్త మంత్రాలని పేరెట్టి కార్యకలాపాలు జరుపుతున్న వారేగాని, ఎవడికీ డొక్క చీల్చి చూస్తే ఒక్క సంస్కృతం ముక్క కూడా కన్పించదు. ఈ కారణం చేతనే నేను, ఆ పూజారి మంత్రాలు చదవకండానే రంగనాయకుడికి హారతి నెత్తుతూంటే ఎదురాడలేదు.

హారతిని మాదగ్గరికి తెచ్చాడు. పళ్లెరంలో తోచినంత దక్షిణ ద్రవ్యరూపంలో ఉంచి మొక్కాలి. అది ఆచారం. నా జేబులోని డబ్బులన్నీ ఐపోయినై. గత్యంతరం లేక "కృష్ణుడూ, చిల్లర ఏమైనా ఉందా?" అనడిగాను. "ఆఁ, ఉంది."—అంటూ జేబులోంచి డబ్బులు తీశాడు. ఐదుగురికీ ఐదు అణా బిళ్ళల్ని ఇచ్చి, మిగిలిన ఒక చిల్లికాని నేను తీసుకున్నాను. అందరూ పళ్లెరంలో తమ చేతుల్లో పట్టుకున్న అణా నాణేల్ని ఉంచి మొక్కారు. నేనూ చిల్లికానీవేసి చేతులు జోడించాను రంగనాయక స్వామికి. అంత వరకూ ఏదో సరదాకని వచ్చినవాణ్ణి, నమస్కరిస్తున్నప్పుడు నా మనస్సుని పూర్తిగా స్వామిలో లగ్నం చేశాను నాకు తెలియకండానే. "అమ్మనూ, చెల్లాయినీ సుఖంగా ఉంచు"—అనే మొక్కును కానీ నా కొఱకేమీ కోరుకోలేదు. రంగనాయకుడికి నా కోరికలని తీర్చేశక్తి లేదని నాకు ఒక నమ్మకం పాదుకుపోయింది. అథవా ఉన్నా నాలాంటి పాపభూయిష్ఠునిపై కరుణాదృష్టి ప్రసారించడం కల్ల అనుకున్నాను.

ఇంకా నేను నమస్కారంచేస్తూ భక్తి పూర్వకంగా మోడ్చిన కళ్ళూ, జోడించిన హస్తాలూ విప్పనేలేదు —"ఎవరిదీ చిల్లికానీ!" అని సజల జలధరంలా కాకపోయినా కొంచెం హెచ్చు స్వరంతోనే గద్దించాడు పూజారి.

"నాది స్వామీ!"—అన్నాను కొంచెం వినయమూ, భయమూ ధ్వనించేటట్లుగా.

"ఇది చెల్లదు" అంటూ కానీతీసి కింద పడవేశాడు.

నాకు కోపం తీవ్రంగా వచ్చేసింది. ఈ ఛాందసుడు కానీ చెల్లదంటున్నాడేమిటి? బజార్లో కానీకి మూడు బీడీలు దొరుకుతాయి. పిల్లలు దాన్నే ఒక రబ్బరు బెలూను క్రిందనో, మరే చిన్న ఆట వస్తువు క్రిందనో మార్చుకుంటారు. ఒక కానీకే లాటరీ చూస్తారు. ఒక రూపాయి వస్తువు కొన్నప్పుడు ఇదే కానీ అమ్మకపు పన్నుగా ఉపయోగపడుతుంది. అది ఇన్ని విధాలుగా, ఇందరి చేత చలామణీ అవుతుంటే ఈ అర్చకుడు చెల్లదంటాడేమిటి?...అతని అభిప్రాయం గ్రహించాను. అది తనకు అంతగా ఉపయోగపడదని, దాన్ని చెల్లనిదానిక్రింద జమకడుతున్నాడు పూజారి. నేను వ్యంగ్యంగా, "అది మీ కొఱకు కాదు స్వామీ! రంగనాథుని కొఱకు."—అన్నాను. కానీ తీసి రంగనాయకుని మీదకు విసిరాను. అది విగ్రహం పాదమూలాన పడింది!

నేనిలా చేసినందుకు అందరూ కడుపుచెక్కలయ్యేట్లు నవ్వారు. పూజారి గ్రుడ్లురిమి చూశాడు. అంతకంటే ఎక్కువేమీ చెయ్యలేక పోయ్యాడు. రంగడు తలమీద పచ్చలు తాపిన స్వర్ణమకుటం ధరించి పూజారి స్వార్థప్రవర్తనని సహనంతో చూస్తూ నిలుచున్నాడు శిలలాగు—నిజానికి శిలే కదూ! అనుకున్నాను నాలో నేను కోపంకొద్దీ.

కృష్ణుడూ, మోహన్, నరసింహం మొదట తీర్థం పుచ్చుకుని అక్కణ్ణుంచి జారుకున్నారు. జగన్నాథమూ వారిననుసరించాడు. పూజారి నాకూ తీర్థమిచ్చాడు. వాటిలో సాధారణపు నీటికుండే రుచేఉంది. నారికేళంలో నీళ్ళుకదా అని నోట్లో పోసుకునేసరికి ఉమ్మివేద్దామనిపించింది. కాని అలా చెయ్యలేదు. నారికేళాలు పగుల గొడ్తున్నప్పుడు ఆ నీళ్ళు భూమిపాలు చెయ్యకండా తీర్థకలశంలో పట్టుకునిఉంటే ఈ పూజారి దేంపొయ్యేది అనుకున్నాను. ప్రక్కనే నిలుచున్న చారి వైపు తిరిగి, "డిస్టిల్డ్ వాటర్ (Distilled water) మిత్రమా!"అని పరిహసించాను. పూజారి చారికి కూడా మూడు గుడు చెంచాల తీర్థం ఇచ్చి, కలశాన్ని తీసికెళ్ళి విగ్రహం చాటునఉంచి వచ్చాడు. భక్తునికి చెందాల్సిన నారికేళార్థ భాగంలో నాలుగు అక్షతలు పడవేసి దాన్ని చేత

పుచ్చుకుని, "నువ్వేనా చిల్లికానీ వేసింది?"—అని ప్రశ్నించాడు రూక్షస్వరంతో.

"అవును."—స్పష్టంగా సమాధానించి అతని ముఖంలోకి చూశాను. అతని ముఖం కందగడ్డగా మారిపోయి ఉంది. కళ్ళలో నిప్పులు రాలుస్తున్నాడు. అతడేమీ అనకుండా ఉండటం చూసి, "ఏమిటి మీరంటున్నది?" అని నేనే ప్రశ్నించాను చివరికి.

వృద్ధుడు కోపాన్ని నిగ్రహించలేకపోయ్యాడు. "ఎన్నడేనా దేవాలయానికి వచ్చావా?" అన్నాడు క్రుద్ధస్వరంతో అతికష్టంగా.

ముసలివాడి ప్రవర్తన నాకు అడుగడుగునా కోపహేతువుగా పరిణమిస్తూంది. "నాకు తెలుసులే దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడని!" అన్నాను అవహేళనగా.

"అబ్బ! ఎంతటి సమయోచితమైన మాటన్నావు మిత్రమా!" గట్టిగా నవ్వుతూ అన్నాడు చారి.

దానిమీద పూజారి మరీ నిప్పులు త్రొక్కిన కోతి అయ్యాడు. వయసు చెల్లిపోయినవాడు కాబట్టి ఏమీ చెయ్యలేక పోయ్యాడు. కాని ఆయన ముఖం చూస్తే నాతో కుస్తీకి దిగేట్లుగానే అగుపించింది. కొబ్బరి టెంకని కోపం కొద్దీ నా చేతుల్లోకి నెట్టి నిరాశా భావంతో తన భాగం తీసుకుని పూర్వద్వారం కడకు నడిచాడు. గర్భగుడిలోని స్వామి రాశీభూతమైన సహనంతో పూజారి ఈ వర్తనాన్ని కూడా సహించాడు. క్షమించాడు రంగనాయకుడు పూజారికిగాని లొంగిపోలేదు కదా, అనిపించింది.

నేను బయటికి వచ్చేసరికి మిత్రులందరూ కేరింతలు కొట్టసాగారు. సంగతేమిటని అడిగాను. కృష్ణుడూ, నరసింహమూ తమ చేతుల్లో కొబ్బరికాయల సగభాగాన్ని చూపించారు నాల్గింటిని. మాట్టంతోనే అవగాహనం చేసుకున్నాను అవి పూజారివని. అందుకు నేనేమీ విచారపడలేదు. మూర్ఖుడికి బాగా శాస్తి జరిగిందని సంతసించాను.

దొంగిలించి తెచ్చిన పచ్చికొబ్బెర తునకల్ని అందరమూ కలిసి ఆరగించాం—మధ్యమధ్య పూజారి తన కొబ్బెరలు మాయమైనందుకు పడేవిచారాన్నీ, మమ్మల్ని తిట్టుకునే తిట్లనీ వర్ణించుకుంటూ తినేప్పుడు ఎవరమూ ఏమీ ఫీలు కాలేదుగాని, తరువాత పూజారి పరిస్థితి ఇలా ఉంటుందని స్ఫురించేసరికి అందరమూ "పాపం!" అన్నాం.

జాతరలో చేసిన గల్లంతు కాకుండా ఆలయంలోనూ ఇంత రభస చేసిన మాలాంటి వాళ్ళకు దేవుడేం మేల్చేస్తాడు? అనే సందేహం పొటమరించింది నాలో. అయితే పర్యవసానంలో రంగనాయకస్వామి మీద కోపం మాత్రం మిగిలింది. తన పేరు చెప్పుకుని ఈ పూజార్లు స్వీయకుక్షింభరత్వంకై దర్శనానికి వచ్చిన భక్తులదగ్గర హృదయపూర్వకంగా ఇచ్చినవేవో పుచ్చుకోక అత్యాశాపరులై ప్రవర్తిస్తుంటే చూస్తూఊరుకోవడం రంగనాయకస్వామికి తగదు అసలు రంగనాథుడు దేవుడు కాడు. పూజారి కుటుంబ పోషణకై దొంగసొమ్ముతో నిర్మించబడిన ఆలయంలో కూర్చున్న ఒక శిల. అందరూ అతణ్ణి గొప్పవాడని నమ్మడమే కాని అతనిలో కించిత్తు మహిమ కాదుగదా, అణువంత హృదయం కూడా నాస్తి.

అందరమూ ఇంటికి చేరుకున్నాం. అమ్మకు నారికేళం ఇచ్చేసరికి సంతోషపడింది. అంతేగాని నేను మిత్రమండలి సహాయంతో 'భగవంతుడి'కి కావించిన అన్యాయం, అపచారం ఆమె ఎరుగదు. కోప్పడుతుందని అసలు నేను చెప్పనే లేదు.

రాత్రికి భోంచేసి ఆరుబయట పక్కపరచుకుని మంచంమీద పడుకున్నాను. బహుళపక్షం చీకట్లో ఆకాశంమీద నక్షత్రాలు మినుకుమినుకు మంటున్నాయి. వాటి కేసి అదేపనిగా చూస్తూ జాతరలో జరిగిన ఘట్టాలను చర్వితచరణం చేసుకుంటున్నాను. ఎప్పుడు నిద్రపట్టిందో...

చెట్లూ చేమలూ నామమాత్రానికైనా కనపడని బయలు ప్రదేశంలో ఏకాంతంగా నిలుచున్నాను. అర్థరహితంగా ఒకేవైపు దృష్టి నిలిపి చూస్తున్నాను. దిశాంతంలో ఏదో పొగమబ్బు గోచరించింది. అది కదలింది. క్రమంగా నన్ను సమీపించింది. సమీపిస్తున్నకొద్దీ అది పొగమబ్బు రూపం వీడి వ్యక్తి రూపం దాల్చసాగింది. దగ్గరికి వచ్చేవరకు నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను. ధవళాంబరాలు ధరించి, రత్నఖచిత స్వర్ణ కిరీట మస్తకంమీద దాల్చి, శంఖుచక్రధారి ఐన రంగనాథుడు ఆయన! సరిగ్గా ఆలయంలోని ఆకారమే. ఆశ్చర్యంతో కళ్ళు నులుముకుని

చూశాను. ఆయన గంభీరంగా చిరునవ్వునవ్వాడు. ఆయన చిరునవ్వుకు నేను తాళలేకపోయాను. అసలు రంగనాథుడనేవాడు ఒకడున్నాడా, లేడా అనే సందేహంలో పూజారిమీద నిందలు మోపి, రంగనాథుణ్ణి అవమానకరమైన దృష్టితో విలోకించాను—మిత్రులతో కూడి ఏదో గొప్ప పాతకం చేసినట్లుగా కంపించిపోయి ఝంఝూనిలోద్ధూత శీర్ణ పత్రంలాగు ఆయన కాళ్ళని చుట్టివేసుకుని "స్వామీ, నన్ను క్షమించండి. అజ్ఞానంతో ఏమిటో చేశాను" అన్నాను ఏడుస్తూ.

ఆయన అప్యాయంగా నా బాహువులు పట్టి లేవదీశాడు. హృదయానికి హత్తుకుని నా కన్నుల్లోంచి జారి చెక్కిళ్ళమీదుగా ప్రవహిస్తున్న అశ్రువుల్ని కొనగోటితో చిదిమివేశాడు. 'బాబూ పరితాపపడకు. నువ్వంటే నాకు అమితమైన ప్రేమ' అన్నాడు నా తల నిమురుతూ.

రంగనాయకస్వామి మాటలకూ, వాత్సల్యానికీ నాలో సంభ్రమమూ, ఆశ్చర్యమూ పొటెత్తినై: "నేనా స్వామీ మీకు ప్రేమపాత్రుణ్ణి! నేనా! నేను? నేను పాపిని. మిమ్ము పూజించటానికి వచ్చిన భక్తులతో నిరంకుశంగా ప్రవర్తిస్తున్న పూజారి వర్తనను సహిస్తూ గర్భగుడిలో నిశ్చలంగా నిల్చున్న శిలారూపులు మీరు, అని అనుకున్న పాతకుణ్ణి! 'మీరు' అనేవారొకరున్నారనే విషయాన్ని కూడా శంకించిన మూఢుణ్ణి. నన్ను క్షమించకండి. నన్నీలోకంలో ఉంచకండి. నాస్తికత్వం నాటుకుపోతుంది" అన్నాను ఆవేశమూ దుఃఖమూ నన్ను ముంచివేస్తూంటే.

"నువ్వు ఎంత వ్యథ చెందుతున్నావో నేను గ్రహించాను బాబూ! ఖేదపడకు. నా విషయమై


మీ ఆరోగ్యం కోసం

కాడ్ లివర్ ఆయిలుతో కూడిన మాల్టు

డి. సి. ఎల్.

ఎక్స్ట్రాక్టు మొదలుపెట్టండి




కాడ్ లివర్ ఆయిలుతో తయారుచేయబడిన మాల్టు డి. సి. ఎల్. ఎక్స్ట్రాక్టు ఔషధ గుణములు కలిగి, త్వరగా జీర్ణమై పుష్టిని చేకూర్చు ఆహారము. ఇందులో చక్కెర, క్రొవ్వు విశేషంగా చేర్చబడడం చేత గొప్ప కెలోరిఫిక్ విలువ పొందవచ్చును. శుద్ధిచేసిన కాడ్ లివరు ఆయిలులో ఏ. డి. విటమినులు వుండడంచేత ఇది అంటువ్యాధులను నివారించి, బలిష్టమైన ఎముకలను, దంతములను పెంచును. మాల్టు డి. సి. ఎల్. ఎక్స్ట్రాక్టులోని బటర్ స్కాచ్ వాసనలు అతి రుచిగా వుండి ఆహారంలోని లోపమును పూర్తిచేయును.

స్కాట్లండ్‌లో తయారై సీసాలలో నింపబడును.

వివరాలకు:

ఓరియంటల్ మర్కంటైల్ డిస్ట్రిబ్యూటర్సు లిమిటెడ్,

హెడ్డాఫీసు: 99-ఏ, ఆర్మీనియన్ వీధి, మద్రాసు-1.

బ్రాంచీలు: పోస్టుబాక్సు నెం. 400, విజయవాడ. పోస్టుబాక్సు నెం. 27, పాలఘాట్.

నువ్వనుకున్న మాటలన్నీ సమంజసమే. నేనున్నాననే విషయంలో నీకు సందేహం రావడం సహజమే. నేను నీకెన్నడూ కనపడలేదు. ఎన్నడూ నీతో మాట్లాడలేదు. అలాంటప్పుడు నేనున్నానని నీకెలా తెలుస్తుంది? నువ్వు పూజారి దగ్గర్నుంచి దొంగిలించి తిన్న కొబ్బరి తునకల గురించి కూడా బాధ పడుతున్నావు అవి మీరు తినలేదు. నేను స్వయంగా ఆరగించాననే తృప్తిపడుతున్నాను."—స్వామి నన్ను ఓదారుస్తూ చెప్పడం ప్రారంభించాడు. "మంచీ చెడూ వేర్వేరు కావు. రెండూ నేనే. అట్లాగే రాగద్వేషాలూ, వెలుగు చీకట్లూ, శాంత్యశాంతులూ అన్నీ నా రూపాలే. పూజారి చెడ్డ చేస్తున్నాడని నేనతణ్ణి అసహ్యించుకోవడం లేదు. మంచి చేస్తున్న వాళ్ళని తల కెక్కించుకోవడం కూడా లేదు. ఇద్దరినీ మన్నిస్తున్నాను. ఐతే ఈ మన్నించటంలో కొంచెం తేడా ఉంది. మంచి చేసిన వాళ్ళని అప్రయత్నంగా మన్నిస్తాను. ఇతరులను కొంచెం ప్రయత్నం మీద. మంచి నా శరీరంలోని ముందు భాగమైతే చెడు వెనుక భాగం. ముందు భాగాన్ని చూసుకోగలిగినంత సునాయాసంగా వెనుభాగాన్ని కనలేను గదా!

"పూజారి నా పేరుమీద భక్తులనించి ఎంతో కొంత ఆర్జించి స్వకుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నేను ఒక వ్యక్తి కుటుంబాన్ని నిలబెట్టడానికి ఎంతటి నిందనైనా భరించడానికి సంసిద్ధుణ్ణి. ఆలయంలోని విగ్రహంలో నేను లేననుకోవడంలో అనృతం లేదు. నేనక్కడ కేవలం శిలనే. శిలను కాకండా మాట్లాడగలిగి పూజారి వర్తనను ద్వేషించుకుంటూ కూచుంటే ఎవరతనికి దక్షిణ ఇస్తారు? నామీద ఆధారపడిన ఆ జీవి ఎలా బ్రతకాలి? అక్కడ ఆ రూపమే నాకు తగింది...

"మరో విషయం చెప్పనా? నా దర్శనార్థం వచ్చే జనమే పూజారి దుష్ప్రవర్తనకు కారణం చాలావరకు. వారిలో చాలామంది పొరుగువాడు పుట్టెడు దుఃఖంలో మునిగిఉన్నా కన్నీరు కార్చని వాళ్ళు. ఆకలితో నకనకలాడుతున్న జీవికి పిడికెడు మెతుకులు పడేయని వాళ్ళు. పంచ రుచులు మెక్కుతూ రోజుకొక్క పర్యాయంకూడా నా నామాన్ని ఉచ్చరించని వాళ్ళు. కేవలం సంవత్సరానికొక్కమారు జాతరకు వచ్చి, నాల్గణాల డబ్బులతో పూజావిత్తాన్ని కొని నాకర్పించి బోలెడు మోక్షాన్ని మోసుకు పోదామన్న ఆశతో వస్తారు. ఆ మోక్షం కొరకు మూఢ నమ్మకంతో కంపు నీళ్ళలో తానమాడుతారు. కాని పారిశుద్ధ్యం నన్ను చేరడానికి ఉన్న మార్గాల్లో ఒకటని ఎవ్వరూ ఆలోచించరు. కోనేటి నీళ్ళలో ముఖం కడుక్కోకండా మీరు మంచి పని చేశారు. మీరు మున్ముందు లోకంలో నాటుకుపోయిన మూఢాచారాలను కూకటి వ్రేళ్ళతో పెరికివేసి నన్ను చేరడానికి సత్యమూ, శాంతీ, దయా, ధర్మమూ, మానవసేవ, పరిశుభ్రత ఇత్యాది సద్గుణాలు మినహా ఇతరములేవీ లేవని బోధించి నన్ను ప్రసన్నుడిని చేస్తారని ఆశిస్తున్నాను

"కడసారిగా నా విషయంలో నేను చెప్పదలచుకున్నది ఏమంటే—పూజారి డబ్బుల కొఱకు మీతో పేచీ పడ్డాడని మీరు నన్ను నిందించారు. కాని నాకందులో కించిత్తు భాగంకూడా లేదు. మీరిచ్చిన కొబ్బరి కాయలూ, డబ్బులూ, నాకు వచ్చినట్లుగానే వచ్చి పూజారికి ఉపయోగపడినై. అట్లాగే మీరు వేసే నిందలుకూడా నానుంచి పరావర్తనం చెంది అతనిలోనే లీనమవుతాయి. నేను అద్దంలాంటి వాడిని; నాలో నీ ముఖాన్ని అందంగా చూసుకోవచ్చు; వికృతంగా చూసుకోవచ్చు."—స్వామి చెప్పిన మాటలు నాకు జీవితంలో ఎవ్వరూ నేర్పని విద్యలాగా ఉపయోగపడ్డాయి. అచేతనుడినై ఆర్ద్రహృదయంతో స్వామి పాదాలమీద కుప్పగా కూలి "రంగనాయకా! దయారాశీ! శాంతమూర్తీ!" అంటూ స్తోత్రం మొదలెట్టాను. కాబోలు అప్పుడే "ఏంనాయనా! నిద్ర లేవకుండానే భగవన్నామ సంకీర్తనం చేస్తున్నావ్!"—అంటూ అమ్మ నిద్ర మేల్కొలిపింది.

